445) కాంభోజి

ప॥ నన్నెరగలేనయ్యా నాయంతర్యామై। వున్నతపుహరి నాలో నున్నాడట॥

చ॥ యిల నేడూ జానలమే నిందులోనివాడ నింతే। తలపు బ్రహ్మాండాలు దాటిపాయ్యీని।
కలువరేకులంతేసికన్నులవాడ నింతే। సొలసి చూపాకాశమే చూరగొనీని॥

చ॥ వెడ వెంట్రుక దూరేటివీనులవాడ నింతే। కడలేనిశబ్దము లొక్కట వినేను।
నడుమ నే నెల్లెడంత నాలికెవాడ నింతె। వుడివోనిసుద్ధు లెల్లా నుగ్గడించేను॥

చ॥ లచ్చన బదారంగుళాలప్రాణ మింతే। కుచ్చి కాలపుదినాలు గొలచీని।
కొచ్చినశ్రీవేంకటేశుకొలువుడుబంట నింతే। పచ్చియింద్రియాల కెల్లా బంపు సేసేను॥